

బేల మండలం కాప్సి(బీ)లో కళావిహీనంగా ఉన్న రైతు వేదిక

# శిథిలంగా రైతు వేదిక

ఆదిలాబాద్ జిల్లా బేల మండలం కాప్సి(బీ) గ్రామంలోని రైతు వేదిక సర్కారు నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరింది. బీఆర్ఎస్ పాలనలో రైతులకు అవగాహన సమావేశాలతో చురుగ్గా పని చేసిన రైతు వేదికలు ఇప్పుడు పట్టించుకునే వారు లేక పాతబంగ్లాలా మారిపోయాయి. రైతుల పరిస్థితిని ప్రతిబింబించేలా మంగళవారం ఈ దృశ్యం 'నమస్తే తెలంగాణ' కెమెరాకు చిక్కింది.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, మే 25

## రాజ్‌గోండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

బోథ్, మే 25 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామంలో జిల్లా అధ్యక్షుడు నైతం జైతు అధ్యక్షతన ఆదివారం రాజ్‌గోండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మండాడి శంభు, అధ్యక్షుడిగా తొడసం భూమన్న, ప్రధాన కార్యదర్శిగా నాగోరావ్, కోశాధికారిగా సోనేరావ్, సంస్కృతిక కార్యదర్శిగా మాడావి లాల్‌దేవ్, సలహాదారులుగా పంద్రం శంకర్, ఆర్ఎస్ నాగోరావ్, వెంకట్‌రావ్, మహిళా ప్రతినిధులుగా గంగామణి, విజయలక్ష్మి, దేవేందర్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

## మున్నూరు కాపు (మెంగ) ..



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నిర్మల్‌అర్బన్, మే 25 : నిర్మల్‌లోని మహాలక్ష్మి ఆలయం వద్ద ఆదివారం మున్నూరు కాపు (మెంగ) కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా భూమన్న, అధ్యక్షుడిగా రాములు, ఉపాధ్యక్షుడిగా నవీన్, సెక్రటరీగా రాజేశ్, కోశాధికారిగా శివప్రసాద్, ఉప కోశాధికారిగా చంద్ర శేఖర్, ప్రధాన కార్యదర్శిగా భూమేశ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా అన్నపూర్ణ, కార్యదర్శిగా విజయలక్ష్మి, ప్రచార కార్యదర్శిగా రాజ్‌కుమార్, సలహా సభ్యులుగా రాజేందర్, పోశెట్టి, శేఖర్, కిషన్, రమేశ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రవీణ్, శ్రీధర్, రాఘవేందర్ తెలిపారు. ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు.

# రహదారులు ఇలా..రాకపోకలు ఎలా ?

- దారంతా కంకర తేలడంతో ప్రయాణానికి పాట్లు



కంకర తేలిన పెండల్‌ధరి రోడ్డు

సారంగాపూర్, మే 25: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని పెండల్‌ధరి గ్రామ పంచాయతీకి వెళ్లే రహదారి ఏళ్ల తరబడి నిర్మాణానికి నోచుకోకపోవడంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఈ తండా మట్టి రహదారిపై కంకరపైకి తేలడంతో గిరిజనులు, వాహనదారులు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. వానకాలంలో రోడ్డుపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పోవాల్సి ఉంటుంది. అలాగే గర్భిణులు కూడా ఈ రోడ్డు గుండా వెళ్ళాలంటే రోడ్డుపైన ప్రసవమయ్యే పరిస్థితి నెలకొంది. రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు గ్రామస్తులు తీర్మానం చేసి పంపించిన లాభం లేదని పేర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు.

## అదుపు తప్పితే.. ప్రమాదమే..



చిత్తగూడ సమీపంలో కోతకు గురైన బీటీ రోడ్డు

నార్నూర్, మే 25 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం డోగంబర్‌గావ్, చిత్తగూడ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. గతంలో కురిసిన వర్షాలకు కోతకు గురైంది. ఈ రోడ్డుపై వాహనం అదుపు తప్పితే ప్రమాదం సంభవించక తప్పదని ప్రయాణికులు భయాబ్రాంత్రులకు గురవుతున్నారు. రాత్రివేళ వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే అంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు అదుపు తప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## చిత్తడిగా అడెల్లి రోడ్డు

బోథ్, మే 25: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని రఘునాథ్‌పూర్ ఖండి మీదుగా నిర్మించిన అడెల్లి రోడ్డు కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతుంది. ఘాట్ ప్రాంతంలో 250 మీటర్ల వరకు ఉన్న రోడ్డు కొద్దిపాటి వర్షం కురిస్తే బురదమయంగా తయారవుతుంది. ద్విచక్రవాహనాలు, ఆటోలు నడవడానికి వీలు లేకుండా మారుతుంది. గుంతల్లో నీరు నిలుస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. నిత్యం వందలాది మంది భక్తులు వెళ్లే అడెల్లి రోడ్డులో ఘాట్ ప్రాంతంలో రోడ్డుకు కావాల్సిన మరమ్మతులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



బోథ్: ఘాట్ ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



బజార్‌హత్నూర్: కొల్హారి సమీపంలో బురదమయమైన రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు

## ప్రయాణికులకు తప్పని తిప్పలు

బజార్‌హత్నూర్, మే 25: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని ఇచ్చోడ-సోనాల ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి కోల్హారి గ్రామ సమీపంలో చినుకు పడితే చాలు రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు బురదలో నుంచి అతి కష్టం మీద బయటకు తీస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ వంతెన నిర్మాణం చేపట్టిన దానిని అనుకొని ఉన్న రోడ్డుకు ఏడాది కాలంగా మొరం వేసి అలాగే వదిలేయడంతో కురిసిన వర్షానికి రోడ్డు బురదమయం కావడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించి బీటీరోడ్డు వేసేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, మే 25 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా (ఆదిలాబాద్, నిర్మల్) లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు, బాలురు)లో ఉపాధ్యాయ, అధ్యాపకుల ఖాళీల్లో పార్ట్‌టైం ప్రాతిపదికన పని చేయుటకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ ఎం లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రడ్యుయేషన్‌తో పాటు బీఈడీ కలిగి ఉండి కనీసం ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. బాలికల పాఠశాల, కళాశాలకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు, అభ్యర్థులను మెరిట్, డెమో ప్రాతిపదికన ఎంపిక చేస్తామని తెలిపారు. డెమో తేదీలను అభ్యర్థులు ఇచ్చిన ఫోన్ నంబర్లకు తెలియజేస్తామని సూచించారు.

### గురుకుల పూర్వ విద్యార్థులకు ఉచిత వృత్తి శిక్షణ

ఎదులాపురం, మే 25 : గురుకుల పూర్వ విద్యార్థులకు ఉచిత వృత్తి శిక్షణ ఇవ్వడానికి గురుకుల విద్యాసంస్థ ప్రణాళిక రుపొందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2017 నుంచి ఇప్పటి వరకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉన్నత విద్య అభ్యసించలేని స్థితిలో ఉండి నిరుద్యోగులుగా ఉన్న విద్యార్థులకు వివిధ రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థ ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ 3 గంటల పాటు శిక్షణ 30 రోజులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

నేరడిగొండ, మే 25 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి అన్‌రెడ్డి భుమారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు కొనసాగాయి. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపకుండా ప్రభుత్వ పాఠశాలలోకి పంపేలా, నాణ్యమైన విద్య అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమ ఎమ్మార్పీలు గంగాధర్, చంద్రశేఖర్, శివలీల, రాజ్‌కుమార్, సంతోష్, రవీందర్ పాల్గొన్నారు.

### ఎస్ఐకి వినతి

భైంసా, మే 25 : నిర్మల్ జిల్లా భైంసాలోని పలువురు ఆదివారం పట్టణ ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముథోల్ మండలంలోని రాళ్లబోరిగాంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని లేదంటే రిలే నిరాహార దీక్షలు చేపడుతామని తెలిపారు. ఇక్కడ దేవీదాస్ హస్తే, అశోక్ చంద్రే, లక్ష్మణ్, రాజారాం, రాములు, గంగాధర్ ఉన్నారు.

### సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

ఉట్నూర్ రూరల్, మే 25 : బంజారా సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలని బంజారా సమాజ్ పెద్దలు, నాయక్‌లు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని పెర్కగూడ గ్రామ సమీపంలో జేసీఎన్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లాలకు చెందిన 9 డోక్రా(ముసలి) లోలావత్, గుగ్లావత్, జాదవ్, మేనపాలకి, సదర్ నాయక్ పరిచయ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వికుల నుంచి వస్తున్న బంజారా సంస్కృతిని కాపాడుకోవాలని అన్నారు. అందుకు నేటి యువత సంస్కృతీ సంప్రదాయాలపై చర్చిస్తూ ఉండాలని సూచించారు. బంజారా భవిష్యత్ నేటి తరంపై ఆధారపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో బంజారా పెద్దలు, నాయక్‌లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### 26, 27న రైతు ముంగిట్లో శాస్త్రవేతలు

ఇంద్రవెల్లి, మే 25 : ఆదిలాబాద్ జిలా ఇంద్రవెల్లి మండలంలో ఈ నెల 26, 27వ తేదీన రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న మండలంలోని గౌరాపూర్‌లో, 27న ముత్నూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి వ్యవసాయ శాఖ శాస్త్రవేతలు రాజేశ్వరి, సురేశ్ హాజరై రైతులకు సాగు విధానంతో పాటు విత్తనాలు, వానకాలం సీజన్ సాగుపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమానికి మండల రైతులు హాజరుకావాలని కోరారు.

### బురదలో కూరుకుపోయిన లారీ



లారీలోని ధాన్యం బస్తాలను ట్రాక్టర్ల ద్వారా వేరే లారీలోకి లోడ్ చేస్తున్న హమాలీలు

నర్సాపూర్ (జీ), మే 25 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)తో పాటు రాంపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం లోడు చేసుకున్న లారీ బురదలో కూరుకుపోయింది. శనివారం ట్రాక్టర్ల సహాయంతో లారీలో ఉన్న ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేసి ఇతర లారీలో లోడ్ చేసి మిల్లులకు తరలించారు.

### రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

నిర్మల్ అర్బన్, మే 25: నిర్మల్ జిల్లాలోని చివరి విడుత ఉపాధ్యాయ శిక్షణ తరగతులు ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు పట్టణంలోని నారాయణ పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈవో రామారావు తెలిపారు. జిల్లాలోని కేటాయించబడ్డ మండలాల నుంచి ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేకాధికారులు, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

### అడవి పంది దాడిలో ఒకరి మృతి

ఉట్నూర్ రూరల్, మే 25 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని రాజులమడుగు గ్రామానికి చెందిన కొడప లక్ష్మణ్(35) ఆదివారం అడవి పంది దాడిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మణ్ తన భార్య లక్ష్మిబాయితో కలిసి మండల కేంద్రలోని వార సంతకు వచ్చి పనుల పూర్తి చేసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో తన కాల కృత్యాలు తీర్చుకొనుటకు పొదల చాటుకు వెళ్లాడు. అక్కడ అడవి పంది దాడి చేయడంతో మృతి చెందాడు. భర్త కేకలు వేయడంతో అక్కడి వెళ్లి చూడగా మృతి చెంది కనిపించాడు. సమాచారం అందుకున్న అటవీ బీట్ అధికారి రాంకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించడం జరిగిందని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

ఉట్నూర్, మే 25 : రైతులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, వాంకిడి తదితర ప్రాంతాల్లో గిరిజన రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, నర్సయ్య, కిషన్, చంద్రమౌళి, వనిత, చంద్రయ్య పాల్గొన్నారు.

### నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీంరావ్ వాగ్మారే, దాదా సాహెబ్ జబాడే

ఎదులాపురం, మే 25 : బౌద్ధులపై మతోన్మాదశక్తులు చేసిన దాడిని ఖండిస్తున్నామని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీంరావ్ వాగ్మారే, దాదా సాహెబ్ జబాడే అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రాళ్లబోరిగాం బుద్ధ జయంతి రోజున బౌద్ధులపై కొందరు మనువాదులు దాడికి పాల్పడడం సమాజానికి సిగ్గు చేటు అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమండ్ చేశారు. సమావేశంలో వసంత్ పవార్ పాల్గొన్నారు.

### ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసుల విత్తన పూజలు



ఇంద్రాదేవి ఆలయంలో విత్తనాల పూజలు చేస్తున్న ఆదివాసులు

ఇంద్రవెల్లి, మే 25: ఇంద్రవెల్లి మండలంతో పాటు ఉట్నూర్, నార్నూర్, సిరికొండ, గూడిహత్నూర్ మండలాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు కుటుంబ సమేతంగా ఇంద్రాదేవి ఆలయానికి తరలివచ్చి విత్తనాల పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వానకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలు బాగా పండాలని, వర్షాలు కురువాలని, జంతువులతో పాటు ప్రజలు సంతోషంగా ఉండాలని ఇంద్రాదేవికి మొక్కుకున్నట్లు ఆదివాసీ పెద్దలు తెలిపారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

సారంగాపూర్, మే 25: నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన వడ్లను తప్పకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కౌట్ల(బీ) సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు ఉన్నారు.

### ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

దిలావర్‌పూర్, మే 25: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన కొంద్రు ఎర్రన్న (45) ఆదివారం గ్రామ సమీపంలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ(ఏఎస్ఐ) భీంరావ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఎర్రన్న మద్యానికి బానిసై మద్యం మత్తులోనే చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ(ఏఎస్ఐ) తెలిపారు.



వడ్డాడి శివారులో ఎండిపోతున్న అవెన్యూ ప్లాంటేషన్

## ఎండుతున్న అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు

తాంసి, మే 25 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని వడ్డాడి, హస్నాపూర్ గ్రామాల శివారుల్లో ప్రభుత్వం చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు ఎండలకు ఎండిపోతున్నాయి. వేసవికాలం మధ్యలో ఈ మొక్కలు నాటడమే కాకుండా, తగిన విధంగా నీరు లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యంతో ఎండిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోతున్న మొక్కల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు స్పందించి నీటి సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


## ఉత్తమ సాహితీ వేతలకు సత్కారాలు



బట్టువార్ అరుణ రచించిన ఆకుపచ్చని కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖ సాహితీ వేతలు

ఇంద్రవెల్లి, మే 25: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు బట్టువార్ అరుణ సాహితీ వేతగా బాలగేయిగా సేవలందించి ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ స్థాపన దినోత్సవం సందర్భంగా బాల సాహిత్య సమ్మేళనంలో ప్రముఖుల చేతుల మీదుగా సత్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా బట్టువార్ అరుణ విద్యార్థుల కోసం రచించిన ఆకుపచ్చని కథలు అనే పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత శ్రీ పత్తిపాక మోహన్, ఏలురి శివారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ సెక్రటరీ డాక్టర్ చెన్నయ్య, ప్రముఖ బాల సాహితీ వేత గరిపెల్ల అశోక్, డాక్టర్ వీఆర్ శర్మ ప్రముఖ సాహితీ వేతల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సాహితీ వేతలు, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి



మాట్లాడుతున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

ఇచ్చోడ, మే 25 : నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షోభంతో కూడుకున్న వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించకుండా, మారుమూల గ్రామీణ అమాయక రైతులను ఆసరాగా చేసుకొని నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్నారన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. సమావేశంలో రైతులు అనిల్, మోహన్, మాణిక్‌రావ్ పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

బేల, మే 25 : ఆదిలాబాద్ జిల్లా బేలలోని ఇంద్రానగర్ కాలనీలో ఓ ఇంటి ఆవరణలో పేకాటాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న ముగ్గురిని పట్టుకుని వారి వద్ద రూ.2వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు.

### గాలివాన బీభత్సం



గాలివానకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు

ఇచ్చోడ(సిరికొండ), మే 25 : ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కన్నపూర్ తండాలో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. కన్నపూర్ తండాకు చెందిన గణియన్ సింగ్, బస్సి రమేశ్, గురుదేవ్ ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఇంట్లో సామగ్రి అంత తడిసిపోయింది. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### చెట్ల కొమ్మలు తొలగింపు

బోథ్, మే 25 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పట్టణ ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సిబ్బంది చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టారు. 11కేవీ విద్యుత్ లైన్ వెంబడి తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలు తొలగించారు. వర్షాలు కురుస్తున్నందున కొద్దిపాటి గాలి వీచిన, చినుకుబడిన చెట్ల మూలంగా సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో తొలగింపు పనులు చేపట్టారు.



సాయినగర్ వద్ద చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

### ప్రమాదకరంగా గుంత



గేర్జం బ్రిడ్జి వద్దపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంత

ఇచ్చోడ, మే 25: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గేర్జం గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న వంతెన కోతకు గురై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. స్థానికులు గుంతలో పడకుండా గుంత చుట్టూ రాళ్లు వేశారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

### కిసాన్ సేవా సమితి సేవలు అభినందనీయం

భైంసా, మే 25 : కిసాన్ సేవా సమితి సేవలు అభినందనీయమని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా భైంసాలో అంబలి పంపిణీ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. 26 రోజులుగా అంబలి పంపిణీ కార్యక్రమం చేపట్టి నిర్విరామంగా కొనసాగించారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, కిసాన్ సేవా సమితి అధ్యక్షుడు అల్లకొండ సాయినాథ్, ఉపాధ్యక్షుడు కాండ్లి సాయినాథ్, కోశాధికారి అల్లకొండ కిషన్, సభ్యులు కుంట కాశీనాథ్, ప్రకాశ్, లక్ష్మణ్, నగేశ్, రమేశ్, పాపేశ్, బండి రవి, పెండెపు శంకర్ పాల్గొన్నారు.